ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025
5
శ్రీ సత్యసాయి

పకడ్బందీగా రీసర్వే : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని తురకలాపట్నం గ్రామ రైతు డి.శ్రీనివాసులు కలెక్టరేట్‌లో ఇచ్చిన అర్జీ మేరకు గురువారం ఆయన తహశీల్దార్ ఉదయ్ శంకర్‌రాజ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆ గ్రామం వెళ్లి రైతు భూమి సమస్యపై ఆరా తీశారు. ఎండియు వాహనం ద్వారా రేషన్ పంపిణీని పరిశీలించారు. బియ్యం సక్ర మంగా పంపిణీ చేస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని కార్డుదారులను అడిగారు. తహశీ ల్దార్ కార్యాలయంలో రీసర్వే ఫైల్స్‌ను పరిశీలించా రు. మండలంలో జరుగుతున్న సర్వేను వేగవంతం గా, రైతులకు ఎలాంటి సమస్య లేకుండా సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వెళ్లి ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ వెంట విజయ లక్ష్మి, డాక్టర్ సోమశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, మండల సర్వేయర్ మైనుద్దీన్, విఆర్‌వో లు రాము, సూర్యనారాయణ, అనిల్, గోపాల్, బాబా, ఫయాజ్, మల్లికార్జున, శ్రీదేవి, అనూష, అంజి ఉన్నారు.

ఆదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో....

రైతుల బతుకులు ఛిద్రం

ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం

సిపిఎం నాయకుల ఎదుట బాధిత రైతుల ఆవేదన

దుమ్ముతో పేరుకుపోయిన చీనీచెట్టును పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, తదితరులు

ప్రజాశక్తి - తాడిమర్రి

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని దాడి తోట, పెద్దకోట్ల, చిల్ల కొండయ్య పల్లి గ్రామ సరిహద్దుల్లో నిర్మిస్తున్న అదాని హైడల్ పవర్ ప్రాజెక్ట్ కర్మాగారం రైతుల బతుకులు ఛిద్రం అవుతున్నాయి. కర్మాగారం నిర్మాణం వల్ల వస్తున్న వాయు, శబ్ధ కాలుష్యం వల్ల చేతికొచ్చిన చీనీ పంటలు పనికి రాకుండాపోతున్నాయని, పెద్ద ఎత్తున చేస్తున్న బాస్టింగ్ వల్ల భూమిలో నీటిపొరలు బ్లాక్ అయి బోర్లలో నీరు రావటం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే మూకుమ్మడి ఆత్మహత్యలు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవటానికి సిపిఎం నాయకులు గురువారం తాడిమర్రి మండలంలో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాపల్లి పెద్దన్నతో పాటు స్థానిక నాయకులు గురువారం మండలంలోనిదాడి తోట, పెద్దకోట్ల, చిల్ల కొండయ్య పల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. బాధిత రైతులతో నాయకులు మాట్లాడారు. రైతుల చీనీ, అరటి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు రైతులు ఇబ్బందులను నాయకులకు వివరించారు. వందల ఎకరాల సాగు చేసిన అరటి, చీనీ తదితర పంటలను లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశామని పంట చేతికొచ్చిన సమయంలో కర్మాగారం నిర్మాణ పనులో భాగంగా వస్తున్న దుమ్ము, ధూళి పంటలపై పడి దెబ్బతిన్నాయని బాధిత రైతులు అరవింద్ రెడ్డి కష్ణారెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి పద్మావతి రఘునందన్ రెడ్డి తదితరులు నాయకుల వద్ద వాపోయారు. చీనీకాయలపై దుమ్ము పడటంతో పంట కొనడానికి వచ్చిన వ్యాపారులు వెనక్కు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారంలో పెద్దఎత్తున రాత్రింబవళ్లు బాస్టింగ్ చేయడంతో ఆ శబ్దాలకు భూమి అదిరి నీటి పోరలు పూడుకుపోతున్నాయని, దీంతో బోరుబావుల్లో నీరు రావటం లేదని కన్నీళ్ల పర్యంతం అయ్యారు. 1.5 కిలోమీటర్ల పొడవుతో 220 అడుగుల లోతు లో నిర్మాణం చేపడుతున్న డ్యామ్ వల్లే మా బోరు బావులు ఎండిపోవడానికి కారణమైందని అంటున్నారు. గత 15 సంవత్సరాలుగా తమ బోర్లలో నీరు ఎప్పుడూ అడుగంటలేదని అన్నారు. తమ గోడుకు ఏ అధికారి పట్టించుకోవటం లేదని విమర్శించారు. పరిశీలనకు వచ్చిన రెవెన్యూ, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కేవలం హైడల్ పవర్ ప్రాజెక్టు మాత్రమే కాకుండా మరేదో చేయడానికి కుట్ర పన్నారని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ గ్రామాల ప్రజలకు ఇక్కడ లేకుండా చేయడానికి పన్నాగం పన్నారని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల వచ్చే వాయు, శబ్ధ కాలుష్యంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని ప్రతి రైతుకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతోందని వాపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

పట్టించుకోని అధికారులు : అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవటం లేదని బాధిత రైతులు వాపోయారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మహిళా రైతు లక్ష్మిదేవి చీనీతోటను పరిశీలించారు. చేతికొచ్చిన చీనీ పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావటం లేదని బాధిత రైతు లక్ష్మిదేవి వాపోయారు. కర్మాగారంలో చేస్తున్న పనుల వల్ల వస్తున్న ధూళి, దుమ్ము తమ తోటలోని

కర్మాగారం పనుల వద్ద మట్టి దిబ్బలు

చీనీచెట్లకు అంటుకుందన్నారు. చీనీకాయల మీద దుమ్ము పేరుకుపోయిందన్నారు. దీంతో వ్యాపారులు తమ పంటను కొనుగోలు చేయడం లేదన్నారు. ఇది తమ ఒక్కరి పరిస్థితే కాదని గ్రామంలో పంటసాగు చేసిన రైతులందరూ ఇదే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. చీనీచెట్లకు అంటుకున్న మట్టిని తొలగించడానికి బట్టలు ఉతకడానికి ఉపయోగించే సర్ఫ్ పొడిని నీటిలో కలిపి పిచికారి చేస్తున్నామని అన్నారు. అలా చేసిన మరుసటి రోజే తిరిగి మట్టి వచ్చి పడుతోందని వాపోయారు. మరికొందరి రైతులు అరవింద్ రెడ్డి కష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి, రఘునందన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ కర్మాగారం ఏర్పాటు పనుల్లో భాగంగా పెద్ద పెద్ద మిషన్లతో కొండను పేల్చుతున్నారని చెప్పారు. ఉదయం 11 గంటలకే ఈ పేలుడు పనులు మొదలుపెడుతున్నారని దీంతో పేలుడుకు ఎగిరి పడే రాళ్లు ఎక్కడ తమ మీద పడతాయోనని కూలీలు కూడా పనులు రావటం లేదన్నారు. ఇదిలా ఉండగా పెద్ద పెద్ద మిషన్లతో చేపట్టిన ఈ పేలుళ్ల శబ్దానికి తమ బోరుబావుల్లో నీరు రావటం లేదని పలువురు రైతులు వాపోయారు. పేలుడు వల్ల ఏర్పడే శబ్దానికి భూమి పొరలు మూసుకుపోయి భూగర్భజలాలు తమ బోరుబావులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధలను వినే అధికారులే కరువయ్యారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయంపై ఆందోళనకు దిగితే అధికారులు వచ్చి అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తాం అంటూ మాటలు చెప్పి వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కర్మాగారం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు కనుమరుగు అవడం ఖాయమని అన్నారు.

రైతుల సమస్యలు పట్టావా..?

జిల్లా కలెక్టర్ స్పందించాలి
లేకపోతే రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తాడిమర్రి మండలంలోనిని దాడి తోట, పెద్దకోట్ల, చిల్ల కొండయ్య పల్లి తదితర గ్రామాల రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవటం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, స్థానిక సిపిఎం నాయకులతో కలసి గురువారం మండలంలోని బాధిత రైతుల పొలాలను పరిశీలించారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితి చూస్తే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు అదాని యాజమాన్యం కింద పనిచేస్తున్నట్టుగా ఉందని అన్నారు. ఎక్కువ భాగం అరటి, చీనీ రైతులు ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. అలాగే చిల్ల కొండయ్య పల్లి గ్రామంలో బోరు బావులలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. ఇక్కడ పనులు నిబంధనల ప్రకారం జరగడం లేదన్న అనుమానం వ్యక్తమవుతోందన్నారు. కర్మాగారం నిర్మాణ పనుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాదాపు 20 సంవత్సరాల దాకా ఆదాయం లభించే పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారం

దెబ్బతిన్న అరటిపంటను పరిశీలిస్తున్న నాయకులు

చూపాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు. ఇక్కడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ దృష్టికి కూడా తీసుకెళతామన్నారు. ఈవిషయంపై పాలకులు, అధికారులు స్పందించకపోతే సిపిఎం బాధిత రైతుల పక్షాన నిలబడి ఉద్యమ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్, బాషా, ఆదినారాయణ, కదిరెప్ప, నాగార్జున, తాడిమర్రి మండల నాయకులు నారాయణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకుందాం

కలెక్ట్ టిఎస్. చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చిత్తడినేలలను గుర్తించి భవిష్యత్తులో వాటిని పరిరక్షించుకుందామని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తడి భూములు పరిరక్షణ, నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పేస్ అప్లికేషన్ సెంటర్ ప్రకారం జిల్లాలో 1349 చిత్తడి నేలలు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తడి నేలలు పరిరక్షణ మరియు నిర్వహణ నియమాలు 2017 ప్రకారం చిత్తడి నేలలను గుర్తించి వాటిని పరిరక్షించి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునే విధంగా అన్ని శాఖల అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న చిత్తడి నేలల డేటాను వేరు చేసి ఉన్న డేటాను ధ్రువీకరించాలని జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణికి సూచించారు. ఇందుకు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒఆర్‌డి సభ్యులుగా ఉండాలన్నారు. నీటి పారుదల ఇంజనీర్లు, మండల తహశీల్దార్ల సంయుక్త పర్యవేక్షణలో మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. మండల కమిటీ బృందంతో సమన్వయం చేసుకొని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, శర్మ, ఆనంద్, మహేష్, డిపిఒ సమత, ల్యాండ్ సర్వే ఎడి విజయశాంతి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు యామిని సరస్వతి, గుర్రప్ప, శ్రీనివాసుల రెడ్డి, సబ్ డిఎఫ్ఒ ఆనంద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలి : ఎస్పీ

ప్రొబేషనరీ ఎస్ఐలతో ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసులు క్రమశిక్షణతో ఉంటూ ఆ శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ వి.రత్న సూచించారు. జిల్లాకు కేటాయించిన నూతన ప్రొబేషనరీ ఎస్ఐలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నిజాయితీ, క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం, నూతన టెక్నాలజీని సద్వినియో గం చేసుకుంటూ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పని చేయాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో టెక్నాలజీని ఉపయోగించి ఉత్తమ ఫలితాలు రాబట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రేహౌండ్స్, బేసిక్ పోలీసింగ్, తదితర అంశాలను పూర్తిస్థాయిలో క్షుణంగా తెలుసుకోవాలన్నారు. 2 నెలలు బెటాలియన్, 1 నెల స్టేషన్ విధులు, 1 నెల వెపన్స్‌ను ఎలా ఆపరేట్ చేయాలనే విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. అన్నింటినీ ఎదుర్కొని ఈ శిక్షణ కాలం పూర్తి చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో సుజాత, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు, మహేష్, వలి, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్‌సింగ్, నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు పాల్గొన్నారు.

దారి సౌకర్యం లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లికి చెందిన రైతు జొన్నగిరి నారాయణస్వామికి చెందిన పొలానికి దారి సౌకర్యం చూపాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని బాధిత రైతు వాపోయారు. గురువారం మండలాన్ని సందర్శించిన సిపిఎం నాయకులకు బాధిత రైతు తమ సమస్యను విన్నవించారు. గ్రామంలోని 15వ సర్వేనెంబర్ నాలుగో లెటర్‌లో ఉన్న ఐదు ఎకరాల భూమి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నానని చెపాపరు. పది సంవత్సరముల నుండి తన భూమికి దారి లేకుండా చేశారని ఈ సమస్యను పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం చూపలేదని వాపోయారు. ఇప్పుడు సాగు చేస్తున్న మామిడి పంటకు మందులు పిచికారి చేయాలన్న ట్రాక్టర్ రావడానికి కూడా దారి లేనందున తీవ్ర నష్టం వాటిల్లుతోదని వాపోయారు. సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళితే సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ఇక్కడి అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ మురుగుకాలువల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం వార్డు పర్యటనలో భాగంగా బెంగళూరు రోడ్డు, సత్యనారాయణ పేట, బోయపేట ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు కాలువల పరిశుభ్రం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎవరు నిర్లక్ష్యంగా వహించిన ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, నాయకులు అమర్నాథ్, దుర్గా నవీన్, మోద శివకుమార్, ఆంజనేయులు,అన్వర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలిపై చర్యలు తీసుకోండి

డిసిహెచ్‌ను కోరిన బాధితులు

తమకు జరిగిన అన్యాయాన్ని డిసిహెచ్ తిప్పేంద్ర నాయక్‌కు వివరిస్తున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య సేవలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకొని, తమ బిడ్డకు జరిగిన అన్యాయం ఇతరులకు ఎవరికి జరగకుండా చూడాలని వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రిల కోఆర్డినేటర్ తిపేంద్ర నాయక్‌ను బాధితులు కోరారు. ఇటీవల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత ప్రీతి మృతి చెందిన సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ తిప్పేంద్ర నాయక్ గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ సూపరిడెంటెంట్ కార్యాలయంలో బాధితులు. ఆ సమయంలో వైద్య సేవలు అందించిన వైద్య ఆరోగ్య సిబ్బందితో విడివిడిగా విచారణ చేపట్టారు. తొలుత మృతిచెందిన బాలింత ప్రీతి భర్త హరిని విచారించారు. గర్భసంచికి కుట్లు సక్రమంగా వేయకపోవడం వల్ల ఆపరేషన్ చేసిన గంటకి అధిక రక్తస్రావం కావడంతో 9 పాయింట్లు ఉన్న రక్తం 3. 5 కు పడిపోయిందని బాధితుడు హరి వాపోయారు. ఆ సమయంలో వైద్యురాలిని వైద్య సేవలు అందించాలని కోరినప్పటికీ సకాలంలో ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు అందించలేదన్నారు. చివరకు అక్కడ ఉన్న సిబ్బందిని కాళ్ళు పట్టుకొని వేడుకుంటే వైద్యాలు ఆసుపత్రికి వచ్చిందనికనీసం తన భార్యను చూడకుండానే రెఫర్ రాసిందని వివరించారు. తాము కూడా వెంటనే ప్రైవేట్ అంబులెన్స్ లో అనంతపురం సర్వజన ఆసుపత్రికి వెళ్లామన్నారు. గర్భసంచికి కుట్లు సక్రమంగా వేయకపోవటం వల్లే ఈ విధంగా జరిగిందనిఅక్కడ వైద్యులు పేర్కొన్నారన్నారు. తన భార్య చావుకు హిందూపురంలో వైద్యులే కారణమని అన్నారు. ఇక్కడి రోగులను వారు సొంత ఆస్పత్రులకు తరలించుకోవడానికి కోసమే వైద్యులు పనిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని డిసిహెచ్ ను కోరారు. దీనిపై తిప్పేంద్రనాయక్ మాట్లాడుతూ, ప్రీతి మతి చెందిన విషయంపై సమగ్రంగా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయనకు చేసిన వైద్య సేవలపై సమగ్ర వివరాలు తెలుసుకోవడం జరిగిందని, అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఆమెకు ఇచ్చిన వైద్య సేవల గురించి నివేదికను తెప్పించుకుని పరిశీలన చేసి, సమగ్ర నివేదికను వైద్య విధాన పరిషత్ డైరెక్టర్‌కు పంపుతామని చెప్పారు. ఇది ప్రాథమిక విచారణ మాత్రమేనని, రాష్ట్రస్థాయి అధికారులు దీనిపై విచారణ చేయడం జరుగుతుందని. వీరితో పాటు జిల్లా కలెక్టర్ సైతం ఈ విషయంలో విచారణ చేస్తారని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంటెంట్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

దంత సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

దంత సంరక్షణ పై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దంతవైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం భారత దంత వైద్యుల సంఘం (ఐడిఎ) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భూపాలం విజయభాను మాట్లాడుతూ లక్షలాది మంది జీవన నాణ్యతను మెరుగుపరచడానికి భారత దంత విభాగం పనిచేస్తుందన్నారు. వివిధ పాఠశాలల్లో డాక్టర్ సురేఖ దేవి, డాక్టర్ భారతిల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహించి ఉచిత దంత పరీక్షలు, సంప్రదింపులు, నోటి ఆరోగ్య అవగాహన ప్రచారాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణ గురించి విద్యార్థులకు వివరిస్తున్న వైద్యులు

రైతులకు నాణ్యమైన సేవలందించాలి : జెడిఎ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డీలర్లు రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి(జెడిఎ) వైవి. సుబ్బారావు సూచించారు. పట్టణంలోని ఎన్జిఒ హోం కార్యాలయంలో గురువారం ధర్మవరం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడిఎ డీలర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. డీలర్లు అందరూ తప్పనిసరిగా ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. షాపు ముందు స్టాక్ బోర్డు, ధరల పట్టికలు ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు విక్రయించాలన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి అవసరమైన విద్యార్హతల కోసం వ్యవసాయ యూనివర్సిటీ నిర్వహించే సర్టిఫికెట్ కోర్స్ కలిగి ఉండాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ జె.సనావుల్లా మాట్లాడుతూ అవసరం మేరకు పురుగు మందులు విక్రయించి భూమి, ప్రజల ఆరోగ్యం కాపాడటంలో మీ వంతు సహకారం అందించాలని డీలర్లను కోరారు. సమావేశంలో ఎడిఎ జి.కృష్ణయ్య, ఏవోలు ఉదయ్‌కుమార్, ఓబిరెడ్డి, ముస్తఫా, రమాదేవి, కృష్ణకుమారి, కవిత, ఆత్మ బిటిఎం ప్రతిభ, డీలర్లు పాల్గొన్నారు.

సమావేశంలో సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్..

ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇళ్ల పట్టాలకు సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ అంశంపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై ఆర్డీవో వివిఎస్ శర్మకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన ఆర్డీవో ఐదుగురు రెవెన్యూ సిబ్బందితో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. 24 గంటల్లో పూర్తిస్థాయిలో నివేదికను అందజేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.

కందుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-రొద్దం

రైతులు కంది కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన కందుల నాణ్యతను గురువారం మార్క్‌ఫెడ్ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. వారు కంది కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కందులను నాణ్యతతో తీసుకొస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. కావున ప్రతి రైతు జల్లెడ వేసి కందులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను శుక్రవారం లెక్కిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దేవస్థానం సిబ్బంది, ఇతర వ్యక్తులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచె, కండువాతో హాజరు కావాలన్నారు. దేవస్థానం సిబ్బంది అందరూ తప్పక హాజరు కావాలని, గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు.

పుట్టపర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలి

మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా పుట్టపర్తి విమానాశ్రయంలో అన్ని వసతులు కల్పించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి నుంచి చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు కొనసాగించేలా చూడాలని కోరారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి మానవ వనరుల దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ఆ చర్యలు తీసుకోవాలని కోరారు. నిధుల లేమితో బుక్కపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందని, వాటిని పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. స్పందించిన మంత్రి లోకేష్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పుట్టపర్తి ఎయిర్ పోర్టు అభివృద్ధిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాజ్యాంగం ద్వారా సంక్రమించిన మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ వి.రత్న మహిళలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని సాయి ఆరామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత సవాళ్లు-పరిష్కారాలు' అంశంపై జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ మహిళలు సవాళ్లను అధిగమించాలని సూచించారు. ఇండియన్ పీనల్ కోడ్‌లో మహిళల భద్రతకు అనేక హక్కులు ఉన్నాయని, వాటి గురించి ప్రతి మహిళకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం సమాజం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన ఉత్తమ మహిళలను ఎస్పీ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ, సిఐలు ఇందిర, సునీత, సురేష్, ఆర్టీసీ రీజినల్ డైరెక్టర్ ప్రమీల, రెడ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి భానుజా, సింగర్ సరళ, సిడిపిఒ గాయత్రి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, మహిళలు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: మహిళా సాధికారతే ఐసిడిఎస్ ధ్యేయ మని సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి, ఎంపిడిఒ గంగాధర్ పేర్కొన్నారు. సిడిపిఒ ఆధ్వర్యంలో గురువారం గుడిబండలో అమరాపురం, గుడిబండ మండలాల అంగన్వాడీ కార్యకర్తలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఎంహెచ్ఒ మంజువాణి, ఎంపిడిఒ గంగాధర్ హాజరయ్యారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆడపిల్లలను లింగ వివక్ష లేకుండా పెంచాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించి బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. ఉత్తమ ఉద్యోగినులుగా డాక్టర్ మంజువాణి, ఆఫీస్ బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీదేవిని సన్మానించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కమలమ్మ, అంగన్వాడీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళలకు జ్ఞాపిక ఇచ్చి సన్మానిస్తున్న ఎస్పీ రత్న

ముదిగుబ్బ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం, వ్యాసరచన పోటీలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టౌన్ సిఐ శివరాముడు, ఎఎస్ఐ బాబునాయక్, పోలీస్ సిబ్బంది సురేష్, అనురాధ, ఉపాధ్యాయులు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక రెయిన్‌బో స్కూల్ విద్యార్థినులను పోలీస్ స్టేషన్ సందర్శనకు తీసుకెళ్లారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ స్టేషన్ విధులు, ఉమెన్ హెల్త్ డెస్క్, రిసెప్షన్ సెంటర్, లాకప్ , స్టేషన్ రికార్డ్స్, విహెచ్ఎఫ్ సెట్, డయల్ 100, 112, మహిళల చట్టాల, తదితర వాటిని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జయసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని పులేకమ్మ ఆలయ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సోమందేపల్లికి చెందిన ఈడిగ మనోజ్‌కుమాం (24), ప్రేమ్‌కుమార్, హర్షద్ స్నేహితులు. వీరు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పెనుగొండ వైపు బయల్దేరారు. అలాగే కర్నాటకలోని చిక్‌బల్లాపూర్‌కు చెందిన శివకుమార్, కార్తీక్ ప్రయాణిస్తున్న కారు ఆగిపోవడంతో వారు పులేకమ్మ ఆలయ సమీపంలోని ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు పక్కనే నిలబడ్డారు. బైక్‌పై అతి వేగంగా వచ్చిన మనోజ్‌కుమార్, వారి స్నేహితులు రోడ్డుపక్కన నిల్చొన్న వీరిని ఢీకొట్టి ఆ తర్వాత రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఈడిగ మనోజ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రేమ్ కుమార్ తీవ్రంగా గాయపడగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హర్షద్‌తో పాటు శివకుమార్, కార్తీక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు

విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ మార్గ మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మునిమడుగు గ్రామానికి చెందిన తిరుమల నాయుడు ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. బుధవారం పెనుకొండలోని ఎంపిడిఒ కార్యాలయంలో పని చూసుకొని ద్విచక్ర వాహనంపై మునిమడుగుకు బయల్దేరాడు. పెద్దచెరువు కట్ట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని సోలార్ ఫ్యాక్టరీ వద్ద లారీని వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే అక్కడికి చేరుకుని తిరుమల నాయుడుని అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

రెవెన్యూ అర్జీలకు 15లోగా పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రెవెన్యూ సమస్యలపై అందిన అర్జీలను ఈ నెల 15వ తేదీ లోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. జెసి డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డితో కలిసి గురువారం కలెక్టరేట్లో ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, సంబంధిత అధికారులతో అర్జీల పరిష్కార,ం వెబ్ ల్యాండ్ పెండింగ్ ఫైల్స్‌పై ప్రగతి గురించి చర్చించారు. జెసి మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకూ నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో అందిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్‌కు అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అర్జీదారుల వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదా అని రెండు మూడు సార్లు నోటీసులు అందజేయాలన్నారు. ప్రతి సోమవారం మండల, జిల్లా కేంద్రంలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌కి దాదాపు 150 నుంచి 200కు పైగా అర్జీలు వస్తున్నాయన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలో ఈ నెల 15వ తేదీ లోపు పరిష్కరించి తగిన నివేదికను సమర్పించాలని జెసి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి అభిషేక్‌కుమార్

సెజ్ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సెజ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి-పరిగి

మండలంలో 2006లో సెజ్(ఎస్ఈజడ్) పేరుతో రైతుల నుంచి సేకరించిన భూములను గురువారం తహశీల్దార్ హసీనాసుల్తానా పరిశీలించారు. గతంలో ప్రభుత్వం ఎకరాకు రూ. 3 లక్షల చొప్పున కేటాయించి భూములను ఎపిఐఐసి పరిధిలోకి తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం అధికారుల ఖాతాలోనే ఉంచుకున్నారు తప్ప రైతులకు ఇవ్వలేదు. ఈ విషయంపై గతంలో సిపిఎం రైతుల భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని పలుమార్లు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. ఇటీవల రైతులు కలెక్టర్ టిఎస్.చేతన్‌ను కలిసి తమ భూములను తమకు అప్పగించి, 18 ఏళ్లుగా నష్టపోయిన పరిహారాన్ని ప్రభుత్వం అందించాలని మొరపెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సెజ్ రైతుల సమస్యలపై నివేదిక కోరారు. దీంతో గురువారం తహశీల్దార్ సెజ్ పొలాల్లో సాగు చేసిన నరసమ్మ పొలాన్ని పరిశీలించారు. అందులో సాగు చేస్తున్న మామిడి, నేరేడు, నిమ్మ పంటలతో పాటు అందులో రైతు నిర్మించుకుంటున్న షెడ్లను పరిశీలించారు. సెజ్ భూముల విలువతో పాటు రైతు సాగు చేస్తున్న పంటల విలువలను స్థానిక రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇకనైనా ప్రభుత్వం న్యాయం చేస్తుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా ఆకస్మిక దాడులు నిర్వహించి ఆరుగురు మద్యం విక్రేతలను అరెస్టు చేసి వారి నుండి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కొల్లకుంటకు చెందిన వెంకటేష్, కొడిగెనహళ్లికి చెందిన గిరీష్ కుమార్ ను, గోళ్లాపురానికి చెందిన యం. జయలక్ష్మిని, మేళాపురం క్రాస్, సదాశివ నగర్ లకు చెందిన లత, లక్ష్మి, భూపతిని అరెస్టు చేసి వారి నుండి 418 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో మొబైల్ స్క్వాడ్ సిఐ గురునాథ్ రెడ్డి, ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, సతీష్, వెంకటేష్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో దుకాణాల నిర్వహణ సమయాలు మార్పు

ప్రజాశక్తి-హిందూపురం

పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలలో ఉన్న ముస్లిం సోదరులను దృష్టిలో ఉంచుకొని రాత్రి వేళల్లో సమయాలలో కొద్దిగా మార్పులు చేస్తున్నట్లు డిఎస్‌పి మహేష్ గురువారం తెలిపారు. పట్టణంలో రాత్రి 10 :30 గంటల వరకు హోటళ్లు షాపులు తెరిచి ఉంచుకోవచ్చని చెప్పారు. కేవలం రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసులు నిబంధనలు సడలించినట్లు ఆయన వెల్లడించారు.

జిల్లా బీసీ వెల్ఫేర్ డిడిపై డైరెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లాలోని బీసీ వెల్ఫేర్ డిడి అవినీతి అక్రమాలపై గురువారం విజయవాడలోని బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జునకు ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడిన బీసీ వెల్ఫేర్ డిడి నిర్మల జ్యోతిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-తాడిమర్రి

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించిందన్నారు. ముఖ్యంగా గర్భిణుల వైద్య పరీక్షల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా ప్రజలను ప్రోత్సహించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో అన్ని రకాల రోగాలకు పరీక్షలు, టీకాలు, మాత్రలు, ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని, ఏ సమస్య వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సరైన అనుభవం, అనుమతులు లేని ప్రథమ చికిత్స కేంద్రాలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ఆమె వెంట డాక్టర్లు హరిత, గోవర్ధన్‌నాయుడు, ఆఫీసర్ ఉరుకుందప్ప, ల్యాబ్ టెక్నీషియన్ మస్తాన్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం అధికారులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 18వ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు తుమ్మల మనోహర్ కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో దివాకర్, పంచాయత్ సెక్రటరీ మంజుల, ఏపీఓ రమణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు

సాధన హైస్కూల్ విద్యార్థినికి ఆర్డీవో అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న సాధన హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న వర్ధిజాహ్నవిని గురువారం ఆర్డీవో మహేష్ తన కార్యాలయంలో గిఫ్ట్‌తో బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డిఎఒ కతిజున్ కుబ్రా కూడా జాహ్నవిని అభినందించారు. ఆర్డీవో మాట్లాడుతూ జాహ్నవి అతి చిన్న వయసులోనే అబాకస్ వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చాటి ఇంటర్నేషనల్ స్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆమెతో పాటు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం భువనేశ్వరిదేవి, అబాకస్ వేదిక్ మాథ్స్ టీచర్ మంజులదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని జాహ్నవిని అభినందిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ కోర్సులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్ లో గురువారం ఎంఇఒ చిన్నకృష్ణ, హెచ్ఎం వెంకటాచలం విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ కోర్సును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతులు, బాలికలపై లైంగిక వేధింపులు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింద న్నారు. బాలికలు తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం అవసరమన్నారు. 7 నుంచి 10వ తరగతి బాలికలకు కరాటే విద్యలో శిక్షణ ఇస్తున్నారన్నారు. అలాగే యుద్ధ విద్యలైన కుంగ్‌ఫూ, కరాటే, జూడో వంటివి నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్షావలి, పిఇటిలు ఎం.శంకర్‌నాయక్, టి.యశోద, సి.సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

కనుంపల్లిలో పోలీసుల గ్రామసభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని కనుంపల్లి గ్రామంలో గురువారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. పేకాట, మద్యం, తదితర చెడు వ్యసనాల జోలికి వెళ్లవద్దన్నారు. సైబర్ క్రైమ్, మహిళలపై జరిగే నేరాలపైన అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలో విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజనం విరామం తర్వాత స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గతంలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చి హామీలు నేటికీ అమలు కావడం లేదన్నారు. వెంటనే ఆయా హామీలను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఐ ఆంజనేయులు, సిఆర్పిలు మస్తాన్, ఆంజనేయనాయక్, రమేష్, మెసెంజర్ జంపాల రమణ, ఐఆర్‌టి సిబ్బంది భారతి పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని అలుపనపల్లి జడ్పీ హైస్కూల్‌లో దాతల సహకారంతో నవంబర్ 26వ తేదీ నుంచి ప్రతిరోజూ విద్యార్థులకు ఉచితంగా మజ్జిగ అందజేస్తున్నట్లు యజనాథరాజు తెలిపారు. కందిరాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దాదాపు 350 మందికి రోజు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. శాశ్వత మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి దాతలుగా వెంకటేశ్వరరాజు, యజునాథరాజు, రేణుక వరప్రసాద రాజు, కెఎల్‌కెఎం మోహన్ రాజు, శంకర్ రాజు, మంజుల, సీతాలక్ష్మి, గాయత్రి, నారప్పరాజు, హేమంత్‌కుమార్, సాహితీ వ్యవహరిస్తున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పరీక్ష సామగ్రి పంపిణీ

అలుపనపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో 40 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అట్టలు పెన్నులు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు యజనాథరాజు తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

పేకాట జూదరుల అరెస్టు

పుట్టపర్తి రూరల్ : మండలంలోని కర్నాటక నాగేపల్లి గ్రామశివారులో చాపచెరువు గుట్టలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడిచేసి జూదరులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 51,530 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU

E.P.No: 505/2024 in ARC/FSBFL No:1415/2022

Between:
M/S. Five Star Business Finance Limited, Anantapur represented by its Authorized Signatory G.Giddaih. Kurnool

...Petitioner/ D.Hr

V/S

1.Guntipalli Nageswaramma W/o Lakshminarayana.G
2.Guntipalli Kishor Kumar S/o Lakshminarayana.G
Both are R/at D.No:1-91, Narasimpalli Village, Bathalapalli Mandal, Anantapur District. Now Sri Sathya Sai District. **...Respondants/J.Drs**

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి.మొత్తమును రాబట్టుటకు జె.డి.ఆర్స్.కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచి వారు 13/03/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in RD Hindupur and SRD of Dharmavaram, within the fields of Nidigallu Village & Panchayath Dharmavaram Mandal, Ananthapr DistNow Sri Sathya Sai District.

Sy No. 315-4, **EXTENT** 242 Sq.yds, **Boundaris**: **East By**: Sri Lakshminarasimha Swamy's Gutta,.**West By**: Rasta, **North By**:Boya Narasimhulu's Plot and **South By**:Exe's Land, Totaly Measuring 242 Sq yards

D.Hr.వాల్యు రూ.5,10,000/-
అమీన వాల్యు రూ.8,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

M.SURESH KUMAR, Advocate,
Ananthapuramu. Cell:9441168233

జనసేనపార్టీలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో గురువారం 200 కుటుంబాలు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో జనసేనపార్టీలో చేరారు. మాజీ సర్పంచి సింగంశెట్టి ఉమాదేవి, లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, కృష్ణమూర్తి, బాబుతో పాటు పలువురికి చిలకం పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ ఆపద వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జయరామిరెడ్డి, ముచ్చురామి సుధాకర్‌రెడ్డి, ప్రతాప్, తొండమాల రవి, ప్యాదిండి వెంకటేష్, సరితాల దస్తగిరి, డిష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలకుంటలో జనసేన పార్టీలో చేరిన వారితో చిలకం

ప్లంబర్స్ స్థలాలపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో సర్వే నెంబర్ 650లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, వాటిపై విచా రణ చేపట్టాలని కోరుతూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయంలో ఏఒకు వినతి పత్రం ఇచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ గతంలో ప్లంబర్స్‌కు కేటాయి ంచిన ఈ భూమిపై పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించగా గత ప్రభుత్వ హయాం లోనే కోర్టు కూడా ప్లంబర్స్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అయితే ప్లంబర్స్ అసోసియేషన్‌లోని కొందరు వ్యక్తులు, అప్పటి అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై, వారికి అనుకూల మైన వారికి స్థలాలు ఇచ్చి అర్హులకు అన్యాయం చేశారన్నారు. అప్పటి తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ అప్పటి అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ డబ్బులు వసూలు చేసి ఎవరికి పడితే వారికి పట్టాలిచ్చారన్నారు. పట్టాల పంపిణీలో అవినీతి, అక్రమాలపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుడగ వెంకట నారాయణ, నాయకులు నాగభూషణ, చిన్నపెద్దన్న, నారాయణ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పెడపల్లి గ్రామంలో గురువారం రైతు కాయల చంద్రాయుడుకు చెందిన మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. చంద్రాయుడు గ్రామ సమీపంలో చిత్రావతి నది పరివాహక ప్రాంత సమీపంలో మూడెకరాల్లో మామిడి చెట్లు సాగు చేశాడు. ఆకతాయిలు పక్కన ఉన్న కొండకు రాత్రివేళ నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి మామిడి తోపులోకి వ్యాపించడంతో సుమారు వంద చెట్లకు పైగా కాలిపోయాయి. అలాగే వ్యవసాయ పరికరాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్పు, విద్యుత్ సర్వీస్ వైరు, పివిసి పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. 8 ఏళ్ల మామిడి చెట్లు తీరా పూత దశకు వచ్చినప్పుడు ఆకతాయిల చేష్టకు కాలి బూడిదవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అగ్నికి కాలిపోయిన మామిడి చెట్లు